క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా...



నెల్లూరు సిటీ: నగరంలోని శాంతినగర్‌లో ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ నాయకుడు మలిరెడ్డి కోటారెడ్డిని ఆ పార్టీ గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మలిరెడ్డిని శాలువాతో సత్కరించి గూడూరులో తన గెలుపునకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలకు డిమాండ్



నెల్లూరు(టౌన్): ప్రభుత్వ నిబంధనల మేరకు ఒంటి పూట బడులు నిర్వహించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర డిమాండ్ చేశారు. నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను గురువారం వారు తనిఖీ చేశారు. కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్నం నుంచి తరగతులు నిర్వహిస్తుండడం గమనించి విద్యార్థులను బయటకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి చరణ్, విష్ణు, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల దహనం



నెల్లూరు(క్రైమ్): మైపాడుగేటు వద్ద ఉన్న దర్గా సమీపంలో రహదారిపై పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలకు గుర్తుతెలియని దుండగులు బుధవారం అర్ధరాత్రి నిప్పు అంటించారు. మంటలను గమనించిన స్థానికులు నిద్ర నుంచి లేచి ఆర్పివేశారు. ఈ ఘటనలో నాలుగు ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. ఈ మేరకు స్థానికులు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నారు.

ఘనంగా మలయాళస్వామి జయంతి



నెల్లూరు(బృందావనం): సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు సద్గురు మలయాళ స్వామి తన జీవితాన్ని అంకితం చేశారని నగరంలోని దత్తాత్రేయ మఠానికి చెందిన మాతాజీ అనంతనందగిరి తెలిపారు. సామాజిక సమరసత వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో గురువారం నిర్వహించిన సద్గురు మలయాళస్వామి జయంతిలో మాతాజీ ఉపన్యసించారు. నారాయణగురు శిష్యులైన మలయాళస్వామి త న జీవిత పర్యంతం మహిళలు, బలహీనవర్గాల సమానత్వం, సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా మాతాజీ అనంతనందగిరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీ రవి, జీ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, జయప్రద, డీ రాజేంద్ర, ఏ జయప్రకాష్, ఎం శ్రీనివాసులు, రాధాకృష్ణ, భావన, ఇంద్రజ పాల్గొన్నారు.

క్షమించడమే క్రైస్తవ్యం



నెల్లూరు(బృందావనం): క్షమించడమే క్రైస్తవ్యానికి మూలమని బాప్టిస్టు చర్చి డొనీహాల్ పాస్టర్ రెవరెండ్ కే శ్యామ్‌సన్‌కుమార్ తెలిపారు. ఏసుక్రీస్తు సిలువ వేయడానికి ముందు రాత్రి చివరి ప్రభు సంస్కారాన్ని నిర్వహించిన నేపథ్యాన్ని స్మరిస్తూ 'ప్రభు సంస్కార ఆరాధన'ను నగరంలోని బాప్టిస్టు చర్చి డొనీహాల్లో గురువారం రాత్రి నిర్వహించారు. ప్రభు రాత్రి భోజన సంస్కార ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జీ అరుణ్‌కుమార్, డీకన్స్ కృపారాజన్, క్వైర్ డైరెక్టర్ బిల్లీశ్యాంసన్, వరప్రసాద్, జ్యోతికుమారి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపై విమర్శలు తగవు

నెల్లూరు సిటీ: తమ నాయకుడు నారాయణపై విమర్శలు తగవని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం ఆయన నగరంలోని జేమ్స్‌గార్డెన్స్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నారాయణపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి చేసిన విమర్శలను ఖండించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండండి

- నెల్లూరు సిటీ రిటర్నింగ్ ఆఫీసర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ వికాస్‌మర్మత్ అన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్, సహాయక పోలింగ్, సెక్టార్ అధికారులకు శిక్షణా తరగతులను నగరంలోని డీకేడబ్ల్యూ మహిళా కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు ఎన్నికల సమయంలో చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా పీఓ, ఏపీఓల విధి విధానాలపై రెండ్రోజుల పాటు అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రెయినర్ల ద్వారా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని పంపిణీ కేంద్రాల వద్ద పోలింగ్ మెటీరియల్‌ను పరిశీలించుకోవడం, స్వాధీనం చేసుకోవడం, పోలింగ్ కేంద్రాలకు తరలించడం, మాక్‌పోలింగ్, ఈవీఎంల సీలింగ్, ప్రతికూల పరిస్థితుల్లో ఈవీఎంల రీప్లేస్‌మెంట్, వీవీ ప్యాట్ల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల్లో డిస్‌ప్లే బోర్డులు, తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణలో కార్పొరేషన్ అదనపు కమిషనర్ శర్మద, ఏఆర్వో దేవీకుమారి, వెంకటరమణ, ఏఈఆర్వో వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పద్మనాభుడు, టీపీఆర్వో ప్రసాద్, మేనేజర్ ఇనయతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఆర్వో వికాస్‌మర్మత్

మా తండ్రిని ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారంలో భాగంగా దోసెలు పోస్తున్న ఆదాల తనయ హిమబిందురెడ్డి



17వ డివిజన్‌లో..



27వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న సన్నపురెడ్డి

- ఆదాలకు మద్దతుగా తనయ ప్రచారం

నెల్లూరు సిటీ: 'నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలన్నదే నా తండ్రి నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆశయం. రానున్న ఎన్నికల్లో నా తండ్రిని ఆశీర్వదించండి' అని ఆదాల కుమార్తె హిమబిందురెడ్డి కోరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 41వ డివిజన్‌లో గురువారం ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని పేర్కొన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తండ్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, 41వ డివిజన్ ఇన్‌చార్జి కువ్వాకొల్లు బాబ్జి యాదవ్, డివిజన్ నాయకులు వేలూరు గోపి, ప్రసాద్, శీను, ఏడుకొండలు, రాజా, మణికంఠ, అరుణమ్మ, మల్లి శ్రీనివాస్, ప్రసాద్, కొండమ్మ, సావిత్రమ్మ, మహేష్, సతీష్, కిషోర్, జీజీహెచ్ కోఆర్డినేటర్ కాకుటూరు లక్ష్మీసునంద, స్వర్ణ వెంకయ్య, వేలూరు శివసునీల్‌రెడ్డి, ముడియాల రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 17వ డివిజన్ ముత్తుకూరురోడ్డు, ఆకుతోట, తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాలకు మద్దతుగా ఏపీఆర్ టీం ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా పార్టీ జనరల్ సెక్రటరీ అనితారెడ్డి మాట్లాడుతూ సంక్షేమాభివృద్ధే వైఎస్సార్‌సీపీ అజెండా అని పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి రానున్న ఎన్నికల్లో ఆదాలను ఆశీర్వదించాలని కోరారు. ఏపీఆర్ బృందం ఇక్బాల్, వైవీరెడ్డి, నరసింహారెడ్డి, అల్లాభక్షు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

- 27వ డివిజన్‌లోని చంద్రమౌళీనగర్‌లో వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచెలరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ ఆదాలతో ఎమ్మెల్యే మేకపాటి భేటీ



నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో నగరంలోని మినీబైపాస్‌రోడ్డులోని ఆయన కార్యాలయంలో ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులపై, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వారి వెంట పార్టీ నాయకులు డాక్టర్ పెళ్లకూరు కిరణ్‌కుమార్‌రెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ఏడుగురి జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): గాంధీగిరిజన కాలనీ సమీపంలోని పెన్నా అండర్ బ్రిడ్జి వద్ద గురువారం పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను సంతపేట ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.8,930 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనధికార మద్యం విక్రయాలు, పంపిణీ, నగదు అక్రమ రవాణా, పంపిణీ తదితరాలను కట్టడి చేసేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఈ తరహా కార్యక్రమాలతో పాటు చట్టవ్యతిరేక కార్యక్రమాలను గుర్తిస్తే డయల్ 112, 94407 00097 నంబర్లకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పోలీసులు అదుపులో హత్య కేసు నిందితులు

నెల్లూరు సిటీ: నగరంలోని మూడోమైలులో ఉన్న విఘ్నేశ్వరనగర్‌లో బుధవారం సాయంత్రం జరిగిన మహిళ దారుణ హత్య కేసులోని నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కిసాన్‌నగర్‌కు చెందిన మస్తానమ్మ(46)ను నెల్లూరు చంటి గొంతుకోసి హత్య చేసి ఆమె కుమార్తె సునీతతో కలిసి పరారైన విషయం తెలిసిందే. వారిని గురువారం వేకువన పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా మస్తానమ్మ హత్య సమయంలో మూడో వ్యక్తి కూడా ఘటనా స్థలంలో ఉన్నట్లు తెలిసింది. సదరు వ్యక్తి ఆర్ఎంపీగా పనిచేస్తున్నారని సమాచారం. సదరు వ్యక్తి హత్యకు సహకరించారా..లేదా.. అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

మీటర్ రీడర్ల పనిదినాలు పెంచండి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పని చేస్తున్న మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్‌ను విద్యుత్ భవన్‌లోని ఆయన చాంబర్‌లో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి హజరత్‌వలీ మాట్లాడుతూ మీటర్ రీడింగ్ తీసే పనిదినాలను ఏడు రోజులకు తగ్గించడంతో మీటర్ రీడర్ల వేతనం తగ్గిపోతుండడంతో పాటు వారు అనారోగ్యల బారిన పడుతున్నారన్నారు. ఈ సమస్యను ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్ దృష్టికి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు బాలకాశి తీసుకెళ్లగా మీటర్ రీడింగ్ తీసే పనిదినాలను తొమ్మిది రోజులకు పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఈ విషయాన్ని ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లగా ఏప్రిల్ నుంచి పనిదినాలను పెంచడంతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకుండా జీతాలు సకాలంలో ఇవ్వని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. అనంతరం సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళికి వినతి పత్రం అందజేశారు. ఎస్ఈను కలిసిన వారిలో యూనియన్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, నరసింహ, విజయ్, సాయి ఉన్నారు.



బాబోయ్ ఎండలు



ఎండలు మండుతున్నాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉదయం 10 గంటలు దాటితే తలలు మాడుతున్నాయి. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చే నగర ప్రజలు భానుడి ప్రతాపానికి గురవకుండా గొడుగులు, క్యాప్‌లు, టవళ్లను తలకు రక్షణగా వినియోగిస్తున్నారు. శీతల పానీయాలతో వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. ఈ దృశ్యాలు నగరంలో గురువారం కనిపించాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు









వైఎస్సార్‌సీపీలోకి వలసల పర్వం



పార్టీలో చేరిన 31వ డివిజన్ వారితో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరుసిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. గురువారం 31వ డివిజన్‌కు చెందిన 50 మంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. మినీబైపాస్‌రోడ్డులోని తన కార్యాలయంలో ఆదాల పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 31వ డివిజన్ ఇన్‌చార్జులు చెన్నారెడ్డి నవీన్‌కుమార్, అయిరెడ్డి, టీవీఎస్ కమల్, బోయిల్ల ఆదిరెడ్డి, నాయకులు వీరపరెడ్డి నారాయణరెడ్డి, అక్కి చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- 29వ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ సత్తార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరాయి. మినీబైపాస్‌లో తన కార్యాలయంలో ఆదాల పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గాంధీనగర్‌కు చెందిన సాహుల్, ఆరీఫ్, అహ్మద్, నూరుల్లా, తదితరులతో పాటు వారి మిత్రబృందం ఉన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు మలిరెడ్డి కోటారెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్రాధ్యక్షుడు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, ఇస్మాయిల్ ఖాదరి, మాజీ కార్పొరేటర్ వెంకటజ్యోతి, చెన్నారెడ్డి నవీన్ కుమార్‌రెడ్డి, డివిజన్ నాయకులు కొండా సాయిరెడ్డి, జాకీర్, సూరిబాబు, అమర్నాథ్, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన 29వ డివిజన్ వారితో ఆదాల

ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. నగరంలోని 6వ డివిజన్ వైవీఎం స్కూల్ రోడ్డు, ప్రకాష్‌నగర్, వాటర్‌ట్యాంక్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేసి ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ ఇంటికి వెళ్లినా ప్రజలు ఆశీర్వదిస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనతో పాటు నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మద్దినేని మస్తానమ్మ, మొగుళ్లపల్లి కామాక్షిదేవి, 7వ డివిజన్ ఇన్‌చార్జి కిన్నెర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఖలీల్‌అహ్మద్

పారిశుధ్య పనుల పరిశీలన

నెల్లూరు(బారకాసు): రంజాన్ పండగ నేపథ్యంలో మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతున్నామని మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. నగరంలోని చిన్నబజార్, కోటమిట్ట ప్రాంతాల్లోని మసీదుల వద్ద పారిశుధ్య నిర్వహణ పనులను గురువారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా మసీదుల పరిసరాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పందులు, వీధి కుక్కలు, దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలు అవగాహన పెంచుకుని నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని తగ్గించాలని కోరారు. నగరంలో నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే దుకాణాలను శాశ్వతంగా సీజ్ చేస్తామని హెచ్చరించారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంహెచ్‌ఓ వెంకటరమణ

నిత్యావసర సరుకుల వితరణ

నెల్లూరు(అర్బన్): కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొత్తూరులోని నెహ్రూ భారతి వృద్ధాశ్రమానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను గురువారం పంపిణీ చేశారు. సాత్వికశ్రీ పదో పుట్టినరోజును పురస్కరించుకుని తల్లిదండ్రులు సురేష్, మౌనిక నిత్యావసర సరుకులను వితరణ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌పీడబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు వారి పుట్టిన రోజు నాడు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పీహెచ్‌పీడబ్ల్యూఏ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ జయప్రకాష్, రూడ్స్ సంస్థ చైర్మన్ రసూల్, నాయకులు శేషయ్య, సుబ్బారావు, మహబూబ్‌బాషా, రెహమాన్, ప్రభావతి, రాజేష్ పాల్గొన్నారు.



రంజాన్‌కు ముస్తాబు



నగరంలోని బారాషహీద్ దర్గా ఈద్-ఉల్-ఫిత్ర్‌కు ముస్తాబవుతోంది. రంజాన్ పర్వదినాన దర్గా ప్రాంగణంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీ. అందుకోసం చలువ పందిళ్లు, ఇతర సౌకర్యాల కల్పన పనులను ముమ్మరంగా చేపడుతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు